కథా నిలయం
6057
శ్రీకాకుళం

# ఋణం

మనిషి జీవితపు పొరల మీద వార్ధక్యాన్ని ఒలికించే కాలం ఆదరణ, అప్యాయతల్ని సైతం చిలికిస్తే... వృద్ధుల శేషజీవితం శోకభాగితం కాదు.

టైము పదకొండయినా తిండి తినక పోవడంతో రాజయ్య ముసలి ప్రాణమంతా బేజారైపోతోంది. ఆకలికి పేగులు ఉండచుట్టుకు పోతుంటే కుక్కి మంచం మీద బిక్కుబిక్కుమంటూ కూచుండిపోయాడలాగే.

అన్నం పెట్టమని నోరు విడిచి కోడల్ని అడగలేదు. ఒకవేళ అడిగినా ఆమె పెడ్తుందన్న నమ్మకం లేదు. ఇంటిపని, వంటపని చేసి... పిల్లల్ని స్కూళ్ళకి, భర్తని ఆఫీసుకి పంపి... అప్పుడు రాజయ్యకింత పడేస్తుంది. అందాకా అతనాగాల్సిందే.

"ఇగో అన్నం...తిను" అన్న కోడలి పిలుపుకి తలెత్తి మసకబారిన చూపుల్ని సారించాడతను. విసరేసినట్లు పళ్ళాన్ని అతడి ముందుకి తోసి, నీళ్ళ చెంబు మంచం కిందపెట్టి విసవిసా లోనికెళ్ళి పోయింది లక్ష్మి.

వృద్ధ శిశువులా ఆదుర్దాగా పళ్ళాన్ని చేతిలోకి తీసుకొని అన్నాన్ని కలుపబోయాడు. కానీ కలుపకుండానే మొహం మాడ్చుకొని పళ్ళాన్ని మరికాస్త పైకెత్తి ముక్కుదగ్గరుంచాడు. చల్లన్నం ఆది నిరాశగా దాన్ని పక్కన పెట్టేసాడు.

"లచ్మీ...లచ్మీ..." కోడల్ని కేకేసి పిలిచాడు.

రెండో పిలుపుకి "పులుసు పోయన్నా?!" అంటూ వచ్చిందక్కడికి.

"కాదవ్వ, గీ అన్నం..." గొంతుకడ్డం పడిందో తడితెర పెదవి విప్పలేదు. మాట పెగలడం లేదు.

"ఏమైందన్నానికి ?" ఉరిమి చూస్తు ప్రశ్నించింది.

"అన్నం... పాసిపోయింది బిడ్డా..." వణుకుతున్న కంఠంలోంచి ముద్దగా రాలిపడ్డాయా అక్షరాలు.

"ఆకలైతే గుల్జం వరిగడ్డి తింటదట. పోనీ ఆకల్లేకపోతే తిననని చెప్పచ్చుగద?... అయినా పనాపాటా తిన్నది అరగడానికి, అరిగినా ఆకలయ్యేతందుకు" మూతి మూడువంకర్లు తిప్పింది.

పచ్చదనం కోల్పోయిన పండుటాకు ఒదిగొదిగి ఉండాలే గానీ చిగురాకులా ఎగిరెగిరి పడకూడదు... రాజయ్యకి అతడి వృద్ధాప్య జీవనానుభవం నేర్పిన తొలి పాఠమిది.

అందుకే "అవ్వతోడు బిడ్డ... నువద్దిగనే పాసిపోయింది !..." చాలా సౌమ్యంగా చెప్పాడు.

వెంటనే "ఇది...పాసిపోయిందా?" అంటూ తెగ ఆశ్చర్యపోతూ "సల్లన్నం గద అట్లన్పిస్తుంది. వాసన్లేదు గీసన్లేదు... తిను." అంటూ గదమాయించి తిరిగి పళ్ళెం రాజయ్య చేతికిచ్చింది.

కోడలు స్వభావం తెలుసా వృద్ధుడికి... మారు మాట్లాడలేదు, "గీపొంటె కూడు తినకపోతే సత్తానా?" అనుకున్నాడు.

"అయ్యగారికి వేడివేడి అన్నం వండి నైవేద్యం పెట్టాలేమో?! పని మాత్రం చాతకాదు గానీ రెండు పూట్లా తిండికైతె తయార్..." అని విసుక్కుంటూ వెళ్ళిపోయిందక్కడి నుండి.

"కొడుకుకి కొలువయ్యిందని తెల్వంగనె ఎనకటి సుట్టిరికం సెప్పి... అయ్యలేని పోరి అని దీనవ్వ కాల్లుపట్టుకుంటే...ఏం మంచిగలేదని కొడుకలిగినా, గట్లనకుర బిడ్డ అని దీన్ని సేసుకుంటే... గిట్టయిపాయే బతుకు..." అని ఈసారా ముసలి మనసు బాధతో మూల్గలేదు.

కానీ ఆకాశంలో నక్షత్రాలు రాలిపడ్డట్టు... అసంకల్పితంగా ఆ వృద్ధ నేత్రాల్లో మెరుస్తోన్న అశ్రుకణాలు... నిర్వేదంగా నిశ్శబ్దమై పోయాడు.

"ఏం జేత్తున్నవురో రాజిగా !" చేతికర్రాడించుకుంటూ వస్తోన్న వెంకటయ్య గుమ్మంలోంచే అరుస్తున్నాడు. చప్పున కంటినీరొత్తుకున్నాడు రాజయ్య.

"దా...దా...గీన్నే గూసున్న..." దగ్గరికొచ్చాడు.

"బువ్వ తిన్నవా?" పక్కనే మంచంమీద కూచుంటూ అడిగాడు వెంకటయ్య.

"తిన్నగనీ...గియ్యాల పొద్దుగాల్నె అచ్చినవేందిరా?"

"ఏం జేసుడు? పొద్దు పొడిత్తె బాదనే...పొద్దుగూకుతె బాదనే... ముసలి ముండా

కొడుకులం...పని సేద్దామంటే రెక్కల్లెవ్వకపాయె. కూసుందామంటే ఉత్తగనే కూసోలేం. నీ కాడ కూసొని నేను, నాకాడ కూసొని నువ్వు బాతకాని కొట్టుకోంది పొద్దెట్ల గడుత్తదిర?" ఆదేపనిగా మాట్లాడేస్తున్నాడు వెంకటయ్య.

అవసరమైతేనే తప్ప పొడిపొడిగా మాట్లాడే రాజయ్యకు పూర్తిగా విరుద్ధం వెంకటయ్య. ఆన్‌చేసి వదిలిన రేడియోలాగా గలగలా మాట్లాడ్తాడు.

"నువద్దిగనేరా, నీయవ్వ సత్తె మంచిగున్నపుడె జల్ది సావాలెగని... గిట్ల కట్టపడుతూ మనోల్లని కట్టపెడ్తు సావద్దురా..."

"అవునుగనీ, గీ అన్నంపళ్ళెం గీడుందేందిరా బువ్వ తిన్లేదా ఏంది?" వెంకటయ్య దృష్టి మంచం కింద పడింది.

"తిన్న...తిన్న..."రాజయ్య కంగారుని పసిగట్టలేకపోతే వెంకటయ్య దోస్తెలా అవుతాడు... పైగా ఆ ఇంటి బాగోతమంతా తెలుసు వెంకటయ్యకి.

ముగ్గురు కొడుకులు కలిసి శేషజీవితాన్ని తలా నాల్గునెలలుగా భాగించుకొంటే... శేషభాగాన్ని బాధగా భరిస్తున్నాడు వెంకటయ్య. ఒక్క నలుసుతోనే నరకయాతనను భవిస్తున్నాడు రాజయ్య. వాళ్ళ వార్ధక్యాల్లో తేడాల్లేవు.

రాజయ్య సమాధానం రుచించలేదు. వెంకటయ్య చూపుల్లో అనుమానం...

గమ్మునవంగి పళ్ళాన్ని చేతిలోకి తీసుకున్నాడు...క్షణంలో అర్థమైందతనికి.

"గిదేందిరో ! రాత్రాను నీ బతుకు కుక్కయవ్వారమైతుంది. గీ పాసిపోయిన బువ్వెడ్తోందిర నీ కోడలు. ఏమ్మనిసిర..."

మరోమాట పెగల్నీయకుండా చేతులు జోడించాడు రాజయ్య కోడలు వింటేగనక పెద్ద రాద్దాంతం చేస్తుందని భయం. సోపతోని నిస్సహాతకి నుదురుమీద కొట్టుకుంటూ ముచ్చట మార్చేసాడు వెంకటయ్య. ఈడికేదైనా తొవ్వ జూపెట్టాల అనుకున్నాడు వెంకటయ్య.

లోపల్నుండి వాళ్ళసంభాషణ వింటున్న లక్ష్మి మనసు కుతకుతా ఉడికిపోయింది. ముసలాళ్ళ మీద పీకల్దాక కోపం ముంచుకొచ్చింది. ఆ ముసలాడొచ్చి ఈ ముసలాడ్ని చెడగొడ్తుండు గద ! అనుకొని ఆ ముసలాన్నేమన్నా అంటే ఈ విషయం నలుగుర్లో పడ్తుందని తమాయించుకుంది.

★ ★ ★

"అడ్డమైనోళ్ళకి చాకిరీ చేస్తూ... వండి పెట్టడం నా వల్లకాదు. ఈ ఇంట్లో ఉంటే ఆ ముసలాడుండాలి లేదంటే నేనుండాలి..." తాను వినడం లేదేమోనని భర్తొచ్చాక లేనిపోనివి చెప్పి సాధిస్తున్న కోడలు మాటలు చెవుల్లో గింగురుమంటుంటె మూగవోయిన మనసుని ఓదార్చుకుంటూ నడుస్తున్నాడు రాజయ్య.

అంగడిబజారు దాటి రోడ్డు మీద కెక్కాడు. ఆయాసం... వ్యామోహభారం... అతడిని వడివడిగా నడవనీయలేక పోతున్నాయి. తనయుల స్వార్థచింతనల్లా పెరిగిపోతున్న భవన

సముదాయాల్ని దాటుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నాడు.

మళ్ళీ ఆలోచనలు...

"ఇక నావల్ల కాదు బాపూ! బండెడు చాకిరీ చేస్తోంది. దాని మీదే వాడకట్లోల్లందరికి చెప్తున్నవంట. నిన్ను సాదుడే కష్టమంటే..." కొడుకు గొంతు తన గుండెని కోస్తున్నా... దుఃఖం బలవంతాన ఆపుకున్నాడు.

"తప్పయిందిరా మల్లగిట్ల జర్గదు..." తండ్రి కంఠంలో వేడుకోలు.

"నాకేం తెలియదు. ఇక్కడి నుండెళ్ళిపో... నీకెక్కడ మంచిగ తోస్తే అక్కడే బతుకు.. నీకు తిండి పెట్టడం నాతోని కాదు..." కొడుకు నిర్దయందంగా చెబుతోంటే - వృద్ధుడి గుండెలో విస్ఫోటం... స్రవిస్తోన్న కన్నీటిలో తుపాను బీభత్సం...

'గీ గుండెల మీదనె గదా ఆడిస్తూ పెంచింది... గదే గుండెల మీదనె తంతున్నడు... ఎవరికీ చెప్పుకోలేని వేదన. సద్దామంటే ధైర్యం చాలడంలేదు. అలా అని బతుకుడెట్ల?'

★ ★ ★

రాజయ్య తన ఆలోచనల్నుండి తేరుకొని గేటుతీసి లోపలికెళ్ళాడు. ఆయనెందుకు పిలిచిండో గద! అనుకొన్నాడు. వెంకటయ్య తన అల్లుని వరుసైన దేవయ్య వకీలుకు రాజయ్య విషయం చెబితె పిలిపించాడు వకీలు. ఆ విషయమై రాజయ్యతో కాసేపు చర్చించాడు.

పదిహేను నిముషాల తర్వాత శేఖర్ వచ్చాడు.

"ఆ...ఇప్పుడు చెప్పు." అని ముసలాయన్ని కదిపాడు వకీలు దేవయ్య.

"నా కీడొక్కడే పోరడు దేవన్న ! దినానికి రొండుపూట్ల గింత కూడెట్టమంటే నాతోని గాదంటున్నాడు!" వర్షిస్తోన్న కళ్ళని పంచెతో తుడుచుకుంటూ వణుకుతున్న కంఠంతో ఆవేదనగా చెప్పాడా వృద్ధుడు.

పక్కనే ఉన్నశేఖర్‌కేసి చూస్తూ "మీ అయ్య చెప్పింది నిజమేనా?" అనడిగాడు వకీలు కళ్ళద్దాల్ని సవరిస్తూ. అవునూ, కాదన్న ధోరణిలో సందిగ్ధంగా తలూపాడు శేఖర్.

"మరి మీ నాన్నబ్రతకడమెట్లా?" తిరిగి ప్రశ్నించాడు వకీలు దేవయ్య.

మౌనంగా తలదించుకున్నాడే తప్ప సమాధానం లేదతని నుండి.

ఈసారి వృద్ధుడి కేసి చూస్తూ "ఇండ్లూ భూములేమైనా వున్నాయా?" అంటూ అడిగాడు వకీలు దేవయ్య.

"గప్పట్లుండె. గాఎకురమున్నర పొలం, ముప్పైగజాల పెంకుటిల్లు ఆడి సదూకోసమే అమ్మేసిన... ఆడు పైకి రావాలని. మాలెక్క కట్టం దెల్వకుండ ఉజ్జోగం పేయాలని పచ్చిన ఆడి తల్లికుండె. గట్టనే పేసిన!"

"రకుతం వున్నన్ని దినాలు కాయకట్టం జేసిన. ఆడికి కట్టం దెల్వకుండ జేసిన. గియ్యాల్లో రేపో అన్నట్టుంది పాణం. గటువంటప్పుడు గీడుతప్పనన్నెవడు జూడాలె! జర నాయం మీరే జెప్పండ్రీ. గందుకే మీ కాడికి పోదామని ఈడ్ని దొల్కొచ్చిన" వయోభారం

తెచ్చిన మార్పువల్లనేమో మధ్యలో ఆయాసపడ్తూ ఒక్కోపదం నెమ్మది నెమ్మదిగా చెప్పాడు.

"మీ తండ్రి చెప్పిన దానికి నీ సమాధానం?" శేఖర్‌ని అడిగాడు వకీలు.

"నాది చిన్న గుమస్తా ఉద్యోగం. దాంతో నాపిల్లల్ని, భార్యని పోషించాలి. చిన్న పిల్లలే అయినా వాళ్ళ కాన్వెంట్ చదువులకి, ఇంటద్దెకే భారమౌతోంది. వీటికి తోడు మా తండ్రిని పోషించడమంటే నావల్ల కాదండీ!" ముఖం మీద గుద్దినట్లు విషయం చెప్పేశాడతను.

"ఏ ఆధారమూ లేని మీ నాన్నెలా బ్రతకడం?" శేఖర్ చెప్పిన దానికి ఆశ్చర్యచకితుడౌతూ అడిగాడు వకీలు దేవయ్య.

"జగిత్యాల గొడ్డుపోయిందా సత్రంలో ఉంటడు." తేల్చి చెప్పేసాడు శేఖర్.

ఆ మాటకి విభ్రాంతికి గురైన వకీలు, "మీరిద్దరూ రెండ్రోజుల్లో కలవండి నా సలహా ఆలోచించి చెబుతాను అందాకా తండ్రిని మీ ఇంట్లోనే ఉంచుకో" అని చెప్పి వాళ్ళిద్దర్నీ పంపించేసాడు.

★ ★ ★

"మీ విషయం బాగా ఆలోచించాను. మీ అబ్బాయి చెప్పినట్లు నువ్వు వృద్ధాశ్రమంలో ఉండడమే సబబు. నిన్ను పోషించాల్సిన అవసరం నీ కొడుక్కిలేదు. ఈ తీర్పు నచ్చకుంటే నీ బ్రతుకేదో నువ్వే చూసుకోవాలి..." అని వకీలు చెబుతోంటే-

"అయ్యో" అంటూ బావురుమన్నాడా వృద్ధుడు. అతని గాజుకళ్ళలో నీటిపొర ఉవ్వెత్తున లేచింది.

"ఇది నీకు సమ్మతమే కదా?" శేఖర్‌ని అడిగాడు వకీలు దేవయ్య. సంతోషంగా తలూపాడతను.

"కానీ ఒక్క షరతు..."

"చెప్పండి."

"ఇదిగో ఈ బాండ్ పేపర్ మీద నీవొక సంతకం పెట్టాలి." కోర్టు పేపర్‌ని అతని ముందుకి తోస్తూ అడిగాడు లాయర్.

"ఎందుకు"? అడిగాడు శేఖర్.

"భవిష్యత్‌లో అంటే నీ అవసానదశలో నీ పిల్లలు నిన్ను పోషించనవసరం లేదని, పట్టించు కోనవసరంలేదని, నీకు నీవుగా బతకాలని నీవు స్వయంగా నీ పిల్లలకి రాసి ఇస్తున్న పత్రమిది." అంటూ ఆగి శేఖర్‌కేసి చూసాడు వకీలు దేవయ్య.

అతని ముఖంలో నెత్తుటి చుక్కలేదు.

"...అర్థమైందనుకుంటా, న్యాయం అందరికీ ఒక్కటే కదా! నేడు నీవు నీ తండ్రిని వదిలించుకున్నట్లు, రేపు నీ పిల్లలు నీ బాగోగుల్ని చూడకూడదనే ఒప్పందమది. అందుకని సంతకం చేయి."

"నేను చేయను."

"అలాగయితే మరి మీ తండ్రిని నీ వెంట తీస్కెళ్ళు."

"..." మౌనం వహించాడు.

"చూడు ! తమ ఆనందాల్ని, కోరికల్ని చంపుకొని అప్యాయతల్ని, అనురాగాల్ని రంగరించి పెంచి పెద్దచేసే తల్లిదండ్రులకి వాళ్ళ అవసానదశలో కొడుకులు అందివ్వాల్సింది రవ్వంత ఆదరణ. అది లేకుండా చేస్తాననంటున్నావు నువ్వు. దీన్ని ఏ ధర్మమూ, ఏ న్యాయమూ, ఏ చట్టమూ చివరికి ఏ సాంప్రదాయమూ హర్షించదు. నిన్ను కని పెంచి నీ సర్వతోముఖాభివృద్ధికి తన సర్వస్వం అర్పించిన నీ తండ్రిని వృద్ధుడన్న జాలి, దయ లేకుండా సత్రంలోనో, వృద్ధాశ్రమం లోనో పడేస్తాననంటావా ?" అంటూ ఆగాడు.

తలవంచుకున్నాడతను.

"నీకో వాస్తవం చెబుతాను. వెంకటయ్య మామ నీ మీద మీ నాన్న తరుపున మెయింటెనెన్సు కేసు వేయి అని చెప్పాడు. సంగతి తెలుకొందామని మొన్నొక పెళ్ళిలో మీ వీధిలోకి వచ్చాను. మీ కుటుంబం గురించి వాకబు చేసాను. అందరి నోళ్ళలోనూ మీ నాన్న మంచితనమే పరిమళించింది. నీ మీద మెయింటెనెన్సు కేసు పెడితే నువ్వే దారికి వస్తావని చాలా మంది చెప్పారు. కేసు పెట్టడమే జరిగితే నీ జీతంలో నుండి వన్‌బై ఫోర్త్ నెలనెలా మీ తండ్రికి చెల్లించాల్సి వుంటుంది. దాంతో ఒక్కడే హాయిగా బతకొచ్చు. కానీ కన్న పేగుకదా కొడుకుని కోర్టుకీడ్చానన్న అపకీర్తి తనకిగానీ, తండ్రిని బాగా చూసుకోవడం లేదన్న అపవాదు నీకుగానీ రాకుండా సమస్యని పరిష్కరించి, నిన్నెలాగైనా ఒప్పించమన్నాడు మీ నాయిన. మీ నాన్న హృదయం ఎంత గొప్పదో ఆలోచించు. నీ మనసు మార్చుకుంటే సర్వత్రా శుభం, లేదంటే మిమ్మల్ని శాసించను... నిర్ణయం మీ చేతుల్లో వుంది, గడువు తీసుకొనయినా అదేమిటో నాకు చెప్పండి".

అప్పటికే శేఖర్ ముఖంలో రంగులు మారసాగాయి. తండ్రి కోర్టు కెడితే పరువు పోతుందన్న భయమో... కొడుగ్గా బాధ్యత గుర్తుకొచ్చిందో... కొన్ని సెకన్ల అనంతరం పశ్చాత్తాప వదనంతో-

"గడువవసరం లేదు. తల్లిదండ్రుల పట్ల కొడుగ్గా నా కర్తవ్యమేమిటో తెలిసేలా చేసారు. నా బాధ్యత గుర్తించాను. నా ఆలోచనా సరళికి నా సంకుచిత ప్రవర్తనకి నన్ను క్షమించండి" అన్నాడు.

"నిన్ను క్షమించాల్సింది నేను కాదు. మీ నాన్న." అన్నాడు వకీలు దేవయ్య.

మరో మాట మాట్లాడలేదు శేఖర్. అప్పుడు వచ్చాడు వెంకటయ్య అక్కడికి.

సిగ్గుపడుతూ తండ్రి పాదాలపై పడ్డాడు శేఖర్. కొడుగ్గా ఋణం తీర్చుకుందామన్న కృతనిశ్చయంతో...

ఆ ముసలి గుండె సంతృప్తితో నిండిపోయి... కళ్ళవెంట ఆనందభాష్పాలు రాలడంతో... ప్రేమగా కొడుకుని పైకి లేపనెత్తాడు. అనురాగం అల్లుకొన్న చేతులతో.